# మీ ఓటు నాకే!

ఊరు నిద్ర లేచింది.

ఉదయానికి వూపిరొచ్చింది.

ఊరుకంటే, ఉదయానికంటే ముందు నిద్ర లేచిన తిరపతి - లేవగానే ఆవలిస్తూ పాకలోంచి బయటికొచ్చి ఆకాశం కేసి చూశాడు. చుక్కపొడిచింది.

చూరుకింద మట్టిబానలో వున్న నీళ్ళు పుక్కిలించి, మొహం కడుక్కుని , తుండుగుడ్డ భుజానేసుకుని, కర్రచేత పుచ్చుకుని, పన్లోకి బయల్దేరాడు.

ఆ వూళ్ళో కెల్లా పెద్ద రైతు, పెదరంగయ్య గారి పెద్ద పాలేరు తిరపతి.

పెదరంగయ్యగారికి దాదాపు అరవయ్యెకరాల పొలముంది. నిండా అరవయ్యేళ్ళ వయసుంది. ఆ వయసు నెదిరించి నిల్చే వొళ్ళుంది. ఆ వొంటి నిండా - డబ్బు పెంచిన మదముంది. ఆయన పడగ్గదిలో ఇనప్పెట్టె నిండా ఇంకా చాలా డబ్బుంది.

నెత్తి మీద కిరీటం లేదు గాని, వుంటే పెదరంగయ్యని ఆ వూరికి మహారాజనవచ్చు.

దొడ్డి గుమ్మంలోంచి గొడ్ల చావిట్లోకి వెళ్ళాడు తిరపతి. గోడకి వేళ్ళాడగట్టిన లాంతరు తీసి వెలిగించాడు.

నెమరేస్తూ పడుకున్న గేదెలు తిరపతిని చూడగానే అరుస్తూ లేచి నిలబడ్డాయి.

చావిట్లో ఓ మూల గడ్డిమీద ఒక పాతగుడ్డ పరుచుకుని, మరో చింకి దుప్పటి కప్పుకుని నిద్ర పోతున్నాడు చిన్న పాలేరు పోలిగాడు.

"ఒకే పోలిగా తెల్లారిపోతోంది లెగరా" అని పోలిగాణ్ణి తట్టి లేపడానికి ప్రయత్నించాడు

తిరపతి.

పోలిగాడు లేవలేదు. మూలిగి, ఒళ్లు విరుచుకుని అవతలి పక్కకి తిరిగి మళ్ళీ పడుకున్నాడు.

పోలిగాడికి నిండా పదేళ్ళు కూడా వుండవు. ఏడాది క్రితమే పెదరంగయ్య గారింట్లో పాలేరుగా చేరాడు. వాడి జీతం అయిదు బస్తాల వడ్లు, రెండు జతల గుడ్డలు, ఎప్పుడన్నా ఓ పూట రెండు ముద్దలు చద్దికూడూ !

ఇంటికెళ్ళి పడుకుంటే తెల్లారకట్టలేచి రాడని, వాణ్ని చావిట్లోనే పడుకోమంటారు. రాత్రి ఏడూ ఎనిమిదింటిదాకా పనిచేసి, ఇంటికెళ్ళి నాలుగు మెతుకులు తిని. మళ్ళీ వచ్చి గొడ్ల చావిట్లో పడుకుంటాడు. మధ్యాన్నప్పూట ఒకటి రెండు గంటలు తప్పితే తెల్లారింది మొదలు రాత్రి దాకా వాడికేదో పని చెపుతూనే వుంటారు.

తిరపతికి పోలిగాణ్ణి చూస్తే జాలేసింది. "బుడ్డ సన్నాసి . ఇంకా నిదరసాల్లేదు గావును, సర్లే ఇంకాసేపు పడుకోనీ అనుకుని వాణ్ణి లేపకుండా వూరుకున్నాడు.

తిరపతికి తన చిన్నతనం గుర్తొచ్చింది. తనూ పోలిగాడి వయసులోనే పెదరంగయ్యగారి దగ్గర పాలేరుగా చేరాడు. అప్పుడు తన జీవితమూ ఇలాగే వుండేది. ఇన్నేళ్ళ తర్వాత ఇప్పుడు పోలిగాడీ బ్రతుకూ అంతే.

అమ్మ చంకలో, నాన్న వొళ్ళో ఆడుకోవ-సిన వయసులో అన్నం కోసమని. ఆటపాటలు మానేసి, అ, ఆ లతో చదువు మానేసి, 'మారాజు' ల గొడ్ల చావిడిలో ఒక గొడ్డుగా పెరిగి, వాళ్ళ పొలం గట్టు మీద ఒక మోడుగా బ్రతికినా, బ్రతకడానికి చాలీచాలని గింజలకంటే ఇంకేమీ ఇవ్వరు ఆ మా రాజులు !

తన జీతం ఇప్పుడు ఇరవై రెండు బస్తాలు. సంవత్సరానికి. చచ్చేదాకా పాలేరు గానే బ్రతికినా ఆ జీతం ముప్ఫయ్‌బస్తాలకి మించదు. పాలేరుతనం మానేసి ఏ కూలో నాలో చేసుకుందామంటే "రైతు కూలీ" అన్న పెద్ద పేరైతే వస్తుంది గాని, ఏడాది పొడుగునా కూలి దొరకదు.

గొడ్లని చావిట్లోంచి విప్పుకొచ్చి, బయటున్న కట్టుగొయ్యలకి కట్టేసి చావిడంతా బాగు చేశాడు తిరపతి. వామిలోంచి వరిగడ్డీ జనపకట్టలూ లాక్కొచ్చి, పాలిచ్చే గేదెలకి జనపకట్టలూ, మిగతావాటి ముందు గడ్డీ పడేశాడు.

అప్పటికి పూర్తిగా తెల్లారిపోయింది.

పోలిగాడు గబగబా లేచి చీపురు పుచ్చుకుని పశువుల దొడ్లోంచి ఇంటి దొడ్లోకి పరుగెత్తాడు.

తిరపతి కుడితి నీళ్ళు కలుపుతుండగా అప్పటిదాకా పాచిపని పూర్తిచెయ్యనందుకు పెదరంగయ్య పెళ్ళాంతో తిట్లు తిన్న పోలిగాడు దిక్కమొహమేసుకుని కళ్ళాపు నీళ్ళల్లోకి పేడ కోసం మళ్ళీ గొడ్లచావిట్లోకి వచ్చాడు.

"ఏంటిరా పోలిగా ! ఇయ్యాలిప్పుడు దాకా పొడుకున్నావ్" అని అడిగాడు తిరపతి

"ఏంటోరన్నా, రాత్తిరి శానా పొద్దోయిందాక నిద్దరపట్టలేదు" అన్నాడు పోలిగాడు.

"ఏం రాత్తిరి బువ్వ తినలేదేంటి " అనడిగాడు తిరపతి.

తనలాంటి వాడికీ, పోలిగాడి లాంటి వాడికి తిండి లేకపోతేనూ, పెదరంగయ్య లాంటి వాడికి తిండెక్కువైతేనూ నిద్ర పట్టదని తిరపతికి తెలుసు.

పోలిగాడు సమాధానం చెప్పలేదు.

"ఏరా ఎక్కడి పనక్కడ వదిలేసి ఇద్దరూ కబుర్లాడుకుంటున్నారు" అంటూ చావిట్లో కొచ్చాడు పెద రంగయ్య.

పోలిగాడు పేడ తీసుకుని వెళ్ళిపోయాడు.

తిరపతి ఒక్కొక్క గేదెనీ విప్పి కుడితి తాగిస్తుండగా పెదరంగయ్య తన పాలేళ్ళిద్దర్నీ మొత్తం పాలేళ్ళ జాతిని కాస్సేపు తిట్టాడు. తిట్లన్నీ అయిపోయాక చుట్ట చుట్టుకుని వెలిగించుకున్నాడు.

అక్కణ్ణించి పోతూ పోతూ "ఇక్కడ పనైనాక ఇంటిముందు జండా కట్టరా ! ఎలక్షన్ దగ్గరకొచ్చేసింది" అని తిరపతికి హుకుం జారీ చేసి వెళ్ళాడు.

వోట్లు వేసే రోజు దగ్గరకొచ్చిందని, అప్పుడు గుర్తొచ్చింది తిరపతికి.

కిందటి ఎలక్షన్లకి తనకి ఓటు లేదు. ఈ సారి లిస్టులో తన పేరు కూడా రాసుకున్నారు తనూ ఓటు వెయ్యొచ్చు.

* * *

పెద రంగయ్య ఇంటి ముందున్న వేపచెట్టు మీదెక్కి జెండా కడుతున్న తిరపతికి - అలాంటి జెండాలే వూళ్ళో ఇంకా చాలా ఇళ్ళ మీదా, ఇళ్ళముందూ కనిపించాయి.

అక్కడక్కడా అయిదారు మాత్రం వేరే పార్టీ లవి ఎగురుతున్నాయి.

ఇన్ని పార్టీ లుండయ్. ఇన్ని జెండాలుండయ్ వోటెవరికెయ్యాలో" అన్న ఆలోచనొచ్చింది తిరపతికి. ఎటూ తేలక చివరికి "అంతా ఎవడికేత్తే మనమూ ఆడికే ఎయ్యొచ్చులే" అనుకున్నాడు.

తిరపతి జెండా కట్టి చెట్టు దిగొచ్చేసరికి - ప్రైమరీ స్కూలు పిల్లలు పదిమంది వరండాలో

కూర్చుని వేరుశనక్కాయలు వొలిచి గింజలు తీస్తున్నారు.

ఆ వూళ్ళో ప్రైమరీ స్కూలుంది గానీ స్కూలు నడపడానికి చోటు లేదు.

పెద రంగయ్య వూళ్ళో వారందరిచేతా అడిగించుకుని, పొగిడించుకునీ తన గొడ్ల పాక వొకటి పాడుబడి వుంటే దాన్ని బడికి దానం చేశాడు.

స్కూల్లో పిల్లలున్నారు గాని చదువు చెప్పడానికి టీచర్లు లేరు. అయిదు క్లాసులకీ, అరవైమంది పిల్లలకీ ఒకడే ఉపాధ్యాయుడు. మరో టీచర్ని నియమించవల్సిందని, వున్న టీచరూ గ్రామస్తులూ కలిసి మొరపెట్టుకోగా, మొర విన్న అధికారులు అలాగే నని ఏడాది దాటింది. మరో టీచర్ మాత్రం రాలేదు.

అంచేత వున్న ఒక్క టీచరూ పిల్లల్లో వంతులవారీగా సగం మందిని మాత్రమే స్కూల్లో వుంచి, మిగతా సగంమందినీ వాళ్ళ మానాన వాళ్ళని వదిలేస్తాడు. ఆవిధంగా వదిలేసిన పిల్లలు మళ్ళీ తమ వంతు వచ్చేవరకూ చెట్లెక్కుతారు, గంతులేస్తారు, కాలవల్లో స్నానాలు చేస్తారు. ఇవన్నీ కాకపోతే పెద రంగయ్య గారింట్లో చిన్న చిన్న పనులు చేస్తారు.

ఏడాది క్రితం కాపరానికెళ్ళిన పెద రంగయ్య కూతురికి కడుపొచ్చిందని కబురొచ్చింది.

ఆ కూతురికి వేరుసెనగ పాకం మీదికి మనసైందని తెలుసుకున్న పెదరంగయ్య భార్య - అర్జంటుగా ఓ ఇరస వేరుశనక్కాయలు తెప్పించి పోసి స్కూలు కుర్రాళ్ళ చేత వొలిపిస్తోంది.

అన్నీ వొలిచేశాక - తలా గుప్పెడు గింజలూ, అందరితో పాటు చెయ్యి చాపిన పోలిగాడికి చివాట్లూ పెట్టింది.

* * *

పది బారల పొద్దెక్కింది.

ఇంక ఇంటికెళ్ళి నాలుగు మెతుకులు తిని, అటు నుంచి పొలం వెళ్దామని ఇంటికి బయల్దేరాడు తిరపతి.

ఊరికీ, మాలపల్లికీ మూడు నాలుగు ఫర్లాంగుల ఎడముంది. ఊళ్ళో చాలా చోట్ల ప్రహరీగోడల మీదా, ప్రహరీలు లేని చోట ఇళ్ళ గోడల మీదా ఎన్నికల పోస్టర్లంటించారు. "మీ ఓటు ఫలానా వారికే. ఫలానా గుర్తుకే..." అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు

తిరపతి ఇంటికెళ్ళేసరికి అతని భార్య చుక్కమ్మ ఇంట్లో లేదు. కుండలో చద్దన్నం లేదు ఆ పూట అన్నం వండినట్లు లేదు.

బయట ఎండబెట్టిన చేపలు కాకులెత్తుకుపోకుండా కాపలా కూర్చున్న ముసలితల్లిని చద్దన్నం గురించీ భార్య గురించీ అడిగాడు తిరపతి.

చద్దన్నం పిల్లలు తినేశారనీ, అప్పుడే బియ్యం అరువు తెచ్చి,తెచ్చిన బియ్యం వండటానికి మంచినీళ్ళ కోసం చుక్కమ్మ వెళ్ళిందనీ సమాధానం చెప్పింది.

ఊళ్ళో చెరువుంది గానీ మంచినీళ్ళకి పనికిరాదు.

ఊరంతటికీ కలిపి మంచినీటి బావి ఒక్కటే వుంది. అందువల్ల ఎప్పుడూ అక్కడ రద్దీ ఎక్కువే. నూతిలో నీళ్ళకేమీ లేకపోయినా నూతి దగ్గర నీళ్ళు తోడుకునే వాళ్ళకి కులభేదాలున్నాయి. పెద్ద కులాల వాళ్ళుండగా, తక్కువ కులాల వాళ్ళు నీళ్ళు తోడుకోటానికి వీల్లేదు.

నీళ్ళు తోడుకునే అవకాశం కోసం అరగంట సేపు వేచి వుండి, మట్టి కడవ నిండా నీళ్ళు నింపుకుని, భుజాన్నెత్తుకుని మెల్లగా ఇంటికి బయల్దేరింది చుక్కమ్మ.

ఎండ చుర్రుమంటోంది.

బావికీ, మాలపల్లికీ బాగా దూరమే వుంది. ఒంటి బరువుకి కడవ బరువు తోడై, నెమ్మదిగా బరువుగా అడుగులేస్తూ నడుస్తోంది. ఎనిమిది నెలల గర్భిణీ చుక్కమ్మ.

పైన చుర్రుమంటున్న ఎండకీ కడుపు లోపల చుర్రుమంటున్న ఆకలికీ కళ్ళు తిరిగి, కడవ బరువుకి కాళ్ళు బెసిగి, దారికడ్డంగా విరుచుకు పడిపోయింది చుక్కమ్మ.

పడినచోట వున్న రాయి నెత్తికి తగిలింది. తల పగిలింది. స్పృహ తప్పింది.

ఆ వూళ్ళో ఆస్పత్రి కోసమని ఆరేళ్ళ క్రితం చిన్న బిల్డింగొకటి గోడలు మాత్రం కట్టి, ఈవూరికి శాంక్షన్ లేదు, పొరపాటున కట్టామని ఆపైన కట్టడం మానుకున్నారు. అంచేత ఆ గోడలున్నాయి గానీ ఆస్పత్రి లేదు.

వూళ్ళో వున్న నాటు వైద్యుడు కడుపునొప్పికీ, తలనొప్పికీ మాత్రమే వైద్యం చెయ్యగలడు తల పగిలిన చుక్కమ్మకి వైద్యం చెయ్యడం - "నా వల్ల కాదు. టౌన్‌కి తీసుకెళ్ళాల్సిందే" అన్నాడు.

టౌన్ ఆ వూరికి ఆరు మైళ్ళుంది. ఆరుమైళ్ళ పొడవునా వున్న రోడ్డుకి ప్రతి అర్ధగజానికీ అరవై గోతులున్నాయి. అందువల్ల ఆ వూరి నుంచి టౌన్ కెళ్ళాలంటే నడక, సైకిలూ తప్ప మరో మార్గం లేదు. వర్షాకాలం కాకపోతే, వొళ్ళు హూనమైపోయినా ఫర్వాలేదనుకుంటే ఎడ్లబండిలో వెళ్ళొచ్చు.

గర్భవతి గనక చుక్కమ్మని టౌన్‌కి తీసుకెళ్ళడానికి ఆ రోడ్డు మీద ఎడ్లబండి పనికి రాదన్నారు . ఒక చిన్న నులక మంచం తిరగేసి చుక్కమ్మ నందులో పడుకోబెట్టి నాలుగు కోళ్ళకీ తాళ్ళు కట్టి వాటి మధ్యగా ఒక లావు కర్ర దూర్చి ముందు తిరపతి, వెనక మరోమనిషీ ఎత్తుకుని టౌన్‌కి మోసుకెళ్ళారు.

"ఇప్పుడింక మేం చేసేదేం లేదు. అంతా అయిపోయింది. ఇంకో గంట ముందు వచ్చి

వుంటే బాగుండేది" అన్నారు ధర్మాసుపత్రిలో డాక్టర్లు

* * *

ఆ ఎన్నికల్లో ఆ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న అభ్యర్థులందర్లోకీ ధనబలమూ పార్టీ బలమూ బాగా వున్న పరబ్రహ్మం నాలుగురోజులకి పోలింగనగా, సతీ సమేతంగా వూరొచ్చాడు.

షావుకారు పెదరంగయ్యనీ ప్రెసిడెంటు చిన రంగయ్యనీ, ఇంకా వూళ్ళో పెద్ద తలకాయల్నీ వెంట బెట్టుకుని ఇంటింటికీ బయల్దేరాడు.

ప్రతి ఇంట్లోనూ మగాళ్ళకి పరబ్రహ్మమూ, ఇంట్లోంచి బయటికి రాని ఆడవాళ్ళకి లోపలికెళ్ళి పరబ్రహ్మం భార్యా నమస్కారాలు చేశారు.

నమస్కారం పెట్టి "మీ ఓటు నాకే" అన్నాడు పరబ్రహ్మం. "అసలు నేను పోటీ చేస్తున్నదే మీ కోసం. అంచేత మీ ఓటు నాకే" అన్నాడు.

ఊళ్ళోనే కాదు. మాలపల్లిలోనూ ఇంటింటికీ తిరిగాడు. అక్కడా అందరికీ నమస్కారాలు పెట్టి "మీ ఓటు నాకే" అన్నాడు.

"ఎమ్మెల్యే అయిన సాయంత్రం ఈ వూరికి రోడ్డు వేయిస్తాను. మర్నాడు ఆస్పత్రి కట్టిస్తాను. మూడోనాడు ప్రైమరీ స్కూల్ జూనియర్ కాలేజీగా మార్పించేస్తాను. నాలుగోనాడు నాలుగిళ్ళకొక మంచినీళ్ళ బావి తవ్విస్తాను. వెనకబడ్డ కులాలవాళ్ళని ముందుకు తీసుకొస్తాను. రైతు కూలీల్ని రైతుల్ని చేస్తాను. ఇంతెందుకు మీ వూర్ని స్వర్గంగా మార్చేస్తాను" అని అందరికీ వాగ్దానాలు చేసి "అందుకని మీ ఓటు నాకే" అన్నాడు.

ఆ రాత్రి ఊళ్ళో పెదరంగయ్య గారి అధ్యక్షతన సభ జరిగింది 'ఎమ్మెల్యే కావడానికి' ఆ మాటకొస్తే మినిస్టరు కావడానికి ఈ దేశంలో పరబ్రహ్మంగారు ఒక్కరే అర్హులు. నేను చెబుతున్నా గదా. వినండి. విని మీ ఓట్లన్నీ వారికే వెయ్యండి" అన్నాడు పెదరంగయ్య.

ఆ తర్వాత పరబ్రహ్మం లేచి "పెదరంగయ్యగారి సంగతి మీకు తెలుసుకదా. ఆయన అబద్ధాలాడరు. ఆయన చెప్పిందంతా నిజమే" అన్నాడు.

"అంచేత మీ ఓటు నాకే" అన్నాడు.

"మనది పవిత్ర భారతభూమి. ఈ దేశంలో గాంధీ, నెహ్రూ పుట్టారు. సీత ,అనసూయా పుట్టారు. మన సంస్కృతీ చరిత్రా చాలా గొప్పవి. అంచేత... మీ ఓటు నాకే" అన్నా.

ఇప్పుడు దేశం చాలా విషమస్థితిలో వుంది. మనమంతా చాలా కష్టాల్లో వున్నాం స్థితిలో ప్రతి పౌరుడూ తన బాధ్యత నెరవేర్చాలి. అంచేత మీ ఓటు నాకే" అన్నాడు.

నెలకి మూడు వానలు కురవాలంటే, దేశంలో దోమలూ, నల్లులూ లేకుండా వుండాలం

మీరంతా రోజుకి అయిదుసార్లు భోంచెయ్యాలంటే రోజూ మీరు చంద్రమండలం మీదికి షికార్వెళ్ళాలంటే "మీ పవిత్రమైన ఓటు నాకే" అన్నాడు.

ఈ రకంగా అందరూ తనకే ఎందుకు ఓటివ్వాలో వివరిస్తూ గంటన్నరసేపు పరబ్రహ్మం బ్రహ్మాండంగా ఉపన్యసించాడు.

పరబ్రహ్మాన్నీ చూసీ, అతని వినయవిధేయతల్నీ చూసీ పెదరంగయ్యని చూసీ వాళ్ళ మాటలు నమ్మి, పరబ్రహ్మానికే ఓటు వెయ్యడానికి వూళ్ళో చాలామంది నిశ్చయించుకున్నారు

అలా నిశ్చయించుకున్న వాళ్ళలో తిరపతి కూడా ఒకడు.

అలా నిశ్చయించుకోనివాళ్ళని కొనడానికని అందుకు కావలసిన నోట్ల కట్టలన్నీ, ఆ రాత్రి తను వెళ్ళిపోయే ముందు పెదరంగయ్య కిచ్చి వెళ్ళాడు పరబ్రహ్మం.

* * *

పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

ఆ నియోజకవర్గమంతటికీ ఆ వూళ్ళో ఎక్కువ శాతం ఓట్లు పోలయినాయి.

చావడానికి సిద్ధంగా వున్న ముసలివాళ్ళూ, కొండొకచో చచ్చిన వాళ్ళూ కూడా వోట్లు వేశారు.

తన నియరెస్ట్ రైవల్ మీద పద్దెనిమిదివేల వోట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించాడు పరబ్రహ్మం.

ఎమ్మెల్యే అయిన తర్వాత మినిస్టర్ కూడా అయ్యాడు. పెదరంగయ్య పెద్ద కొడుక్కి మెడిసిన్ సీటు దొరికింది.

చినరంగయ్య గారి అల్లుడికి 'మంచి ఉద్యోగం' దొరికింది. ఎల్లయ్య గారి తమ్ముడికి బిజినెస్ పర్మిట్ వచ్చింది. పుల్లయ్య గారి బావమరిది ఇండస్ట్రీకి 'ప్రభుత్వ రుణం' లభించింది.

కాని -

ఆ వూళ్ళో తిరపతి తిరపతిగానే వున్నాడు.

పోలిగాడు పోలిగాడుగానే వున్నాడు.

ఆ వూరికి రోడ్డు పడలేదు.

ఆస్పత్రి రాలేదు.

ప్రైమరీ స్కూల్‌కి రెండో టీచర్ రాలేదు.

మాలపల్లికి మంచినీళ్ళ బావి రాలేదు.

రైతు కూలీలు రైతులు కాలేదు.

ఆ వూరు స్వర్గం కాలేదు.

ఇంతకీ ఆ వూరు పేరేమిటో ?

రంగాపురమా ?

అవును !

రావులపాడా ?

అవునవును !

తాళ్ళపాలెమా ?

ఎగ్జాక్ట్లీ !

తంపులగూడెమా ?

యూ ఆర్ రైట్ !

అయినా ఈ గొడవంతా ఎందుకు ? బాగా గుర్తుంటుంది - 'భారతదేశం' అనండి.

●

*(ఆంధ్ర జ్యోతి సచిత్ర వారపత్రిక :ఉగాది ప్రత్యేక సంచిక - 1972)*